

నరేశ్ కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

# మృతుల కుటుంబాలకు పరామర్శ

గజ్వేల్, మే 31: మండలంలోని అహ్మదీపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త వడ్ల నరేశ్‌చారి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి శుక్రవారం సానుభూతి తెలిపారు. అహ్మదీపూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడు నిజాం తండ్రి నజీర్ మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పార్టీ నాయకులు మాదాసు శ్రీనివాస్, బెండె మధు, మద్ది రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రమేశ్‌గౌడ్, అహ్మద్ అన్నారు.

# బీఆర్ఎస్ అధినేతపై కుట్రపూరిత ఆరోపణలు

చేర్యాల, మే 31 : తెలంగాణ తొలి సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై కాంగ్రెస్ సర్కారు, ఆపార్టీ నాయకులు కుట్రపూరితమైన ఆరోపణలు చేస్తున్నారని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలుయాదవ్ అన్నారు. పట్టణంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ సర్కారు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, ప్రజాక్షేత్రంలోకి వెళ్లి కేసీఆర్ ఉద్యమిస్తున్న క్రమంలో ప్రజల నుంచి వచ్చే స్పందన తట్టుకోలేని కాంగ్రెస్ నాయకులు, సర్కారులోని పెద్దలు ఫోన్ ట్యాపింగ్, మేడిగడ్డ తదితర వాటిని ముందుకు తీసుకువచ్చి ప్రజల దృష్టిని మరల్చేందుకు కుట్రలు చేస్తున్నట్లు ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్‌పై ఇదే విధమైన అసత్య ప్రచారాలు ఎన్నో చేశారని, అయినా ప్రజలు నమ్మలేదన్నారు. కేసీఆర్‌పై కుట్రతో కాళేశ్వరం ప్రాజెక్టును ఎండబెట్టడడంతో తెలంగాణ రాష్ట్రంలో నీళ్లు లేక చెరువులు, పంటలు ఎండిపోయి రైతు లు రోడ్డున పడ్డారన్నారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో ఇప్పటికే కేసీఆర్ ప్రజలకు స్పష్టమైన వివరణ ఇచ్చారని, ప్రతిరోజూ ఏదో ఒక ఆరోపణ చేయాలనే తలంపుతో సీఎంతో పాటు మంత్రులు తిట్లపురాణం అందుకుంటున్నారని ఆరోపి ంచారు. తెలంగాణ రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమంపై కేసీఆర్ ఉన్న ప్రేమ ఢిల్లీ నుంచి పాలన సాగించే పార్టీలకు ఉండవన్నారు.



పర్వతాలుయాదవ్

# ఇంటర్నేషనల్ పాఠశాలలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

మిరుదొడ్డి, మే 31: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి మండలంలో ఇంటర్నేషనల్ పాఠశాలలు ఏర్పాటు చేయాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జాతీయ కార్యదర్శి శంకర్ అన్నారు. డీబీఎఫ్ నాలుగో మహా సభల్లో తీర్మానించిన తీర్మానాలను బుధవారం లింగుపల్లిలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజలకు వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని దళితులు, పేదలకు రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన విద్యను అందించాలని డిమాండ్ చేశారు. బడిబాట కార్యక్రమాన్ని ప్రభుత్వం మొక్కుబడి కాకుండా ప్రణాళిక బద్ధంగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీబీఎఫ్ నాయకులు చందు, నరేశ్, బాలనర్సు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అథ్లెటిక్స్ క్రీడాకారులకు మంచి భవిష్యత్



అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న అసోసియేషన్ అధ్యక్షుడు

సిద్దిపేట, మే 31: అథ్లెటిక్స్ క్రీడాకారులకు మంచి భవిష్యత్ ఉన్నదని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గ్యాదరి పరమేశ్వర్, వెంకటస్వామిగౌడ్ అన్నారు. శుక్రవారం సిద్దిపేట జయశంకర్ స్టేడియంలో జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంపికైన క్రీడాకారులు జూన్ 5 6 తేదీల్లో హనుమకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. జిల్లా సైకిల్ సంఘం అధ్యక్షుడు బండారుపల్లి శ్రీనివాసులు, టీజీ పేటా జిల్లా అధ్యక్షులు ఏర్వ అశోక్ , జిల్లా రెజ్లింగ్ ప్రధాన కార్యదర్శి కడకంచి ఉప్పలయ్య, జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కనకయ్య, జిల్లా ప్రైవేట్ వ్యాయామ ఉపాధ్యాయుల అధ్యక్షులు బయ్యారపు కనక, రెడ్డి, శిక్షకులు ప్రభాకర్ కృష్ణకుమార్, నిశాంక్‌గౌడ్, శ్రీకాంత్ సాయి కుమార్‌గౌడ్, లీలాఆనంద్, బట్టు వేణు, సీనియర్ అథ్లెట్లు పాల్గొన్నారు.

# నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలి



లింగాపూర్‌లో నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో రామ్మోహన్

మద్దూరు(ధూళిమిట్ట), మే 31: అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి మద్దూరు మండలంలో చేపట్టిన పాఠశాల భవనాల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో రామ్మోహన్ సూచించారు. శుక్రవారం ధూళిమిట్ట మండల కేంద్రంతో పాటు మండలంలోని లింగాపూర్‌లో కొనసాగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ త్వరలోనే పాఠశాలలు పునఃప్రారంభం కానున్న దృష్ట్యా పనులను పూర్తిచేయాలన్నారు. ఈనెల 3 నుంచి 19వ తేదీ వరకు కొనసాగే బడిబాటపై మద్దూరు మండల పరిషత్ కార్యాలయంలో నేడు ఉదయం అధికారులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

# నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



నారాయణరావుపేట: లక్ష్మీదేవిపల్లిలో తనిఖీ చేస్తున్న అధికారులు



మర్కూక్: గణేశ్‌పల్లిలో జీలుగ విత్తనాలను ప్రదర్శిస్తున్న ఏవో నాగేందర్‌రెడ్డి

నారాయణరావుపేట, మే 31 : నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏవో రమణి, సిద్దిపేట రూరల్ ఎస్సై అపూర్వ అన్నారు. నారాయణరావుపేట, లక్ష్మీదేవిపల్లి గ్రామాల్లో ఫర్టిలైజర్ దుకాణాల్లో శుక్రవారం వారు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విత్తనాల కొనుగోలులో తప్పకుండా రైతులకు రసీదులు ఇవ్వాలన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని కోరారు. అనంతరం ఫర్టిలైజర్ దుకాణాల్లో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎస్సై పరమేశ్వరి, అధికారులు పాల్గొన్నారు.

## అందుబాటులో జీలుగ విత్తనాలు

మర్కూక్, మే 31: మండలంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంతో పాటు గణేశ్‌పల్లిలో జీలుగు విత్తనాలు రైతులకు రాయితీపై ఇస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి నాగేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం గణేశ్‌పల్లిలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీలుగ విత్తనాలు వేయడం వల్ల ఎకరానికి 10 టన్నుల పచ్చి రొట్ట లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ జీలుగు విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు,అధికారులు పాల్గొన్నారు.

# ఎల్లమ్మ చెరువు నీళ్ల జోలికొస్తే ఖబడ్దార్

## రైతులు, ముదిరాజ్ కులస్తుల మధ్య చిచ్చుపెడుతున్న కాంట్రాక్టర్

- అక్రమంగా తూము తెరిచి గండికొట్టించిన కాంట్రాక్టర్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి
- అఖిలపక్ష నాయకులు, రైతుల డిమాండ్



ఎల్లమ్మ చెరువు తూము వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు, అఖిలపక్ష పార్టీల నాయకులు

హుస్నాబాద్, మే 31: హుస్నాబాద్ పట్టణ ప్రజలకు తాగునీరందించడంతో పాటు ఆయకట్టు రైతులకు చెందిన వ్యవసాయ బావులు, పశుపక్షాదులకు ఆదరువు అయిన హుస్నాబాద్ పట్టణ శివారులోని ఎల్లమ్మ చెరువు నీళ్ల జోలికొస్తే ఖబడ్దార్ అని రైతులు, అఖిలపక్ష నాయకులు హెచ్చరించారు. ఎల్లమ్మ చెరువులో చేపల కాంట్రాక్టర్ అనుమతులు లేకుండా గండికొట్టి, తూమును తెరిచి నీళ్లను వృథాగా బయటకు పంపడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం అఖిలపక్ష నాయకులు, ఆయకట్టు రైతులు చెరువు కట్ట తూము వద్దకు చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. చేపల కోసం చెరువు నీళ్లను అక్రమంగా బయటకు పంపిన కాంట్రాక్టర్‌పై క్రిమినల్‌చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని ముదిరాజ్ కులస్తులను రెచ్చగొట్టి రైతులు, ముదిరాజ్‌ల మధ్య చిచ్చుపెట్టేందుకు కాంట్రాక్టర్ కుట్రలు చేస్తున్నాడని ఆరోపించారు. తూమును తెరవాలంటే నీటి పారుదల శాఖ అధికారుల అనుమతితో తెరవాల్సి ఉంటుందని, కాంట్రాక్టర్ రాత్రికి రాత్రే తన వద్ద ఉన్న సామగ్రితో తూమును తెరవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నీటి పారుదల శాఖ అధికారులతో కుమ్మక్కై సదరు కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. చేపలు పట్టుకునేందుకు తాము వ్యతిరేకం కాదని, నీళ్లను వృథా చేసి చేపలు పట్టుకోవడమేంటని ప్రశ్నించారు. కాంట్రాక్టర్ నిర్వాకం వల్ల చెరువునీళ్లు సగం వరకు బయటకు పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు బాధ్యులైనవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, బీఆర్ఎస్ నాయకులు వెంకట్, అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, సుధాకర్, కాంగ్రెస్ నాయకులు రాజు, రాములు, బీజేపీ నాయకులు శ్రీనివాస్, శంకర్‌బాబు, అనంతస్వామి, రాంప్రసాద్, బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ రవీందర్ గౌడ్, ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

# నేటి నుంచి ఆలయ వార్షికోత్సవం



గాగిల్లాపూర్‌లోని కాళీమాత ఆలయం



హుస్నాబాద్‌టౌన్: పట్టణంలోని గోదాంగడ్డ హనుమాన్ ఆలయం

మద్దూరు(ధూళిమిట్ట) మే 31: మద్దూరు మండలంలోని గాగిల్లాపూర్ కాళీమాత ఆశ్రమంలో పరమయోగిని కాళీమాత ఆధ్వర్యంలో నేటి నుంచి కాళీమాత ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం కానున్నాయి. వార్షికోత్సవాలకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నేడు (శనివారం) ఉదయం అఖండ దీపారాధన, సర్వదేవతపూజ, ఏడు గంటలకు కాళీమాతకు అభిషేకం, మహారుద్రచండీయాగం, కుంకుమార్చన, లక్షపుష్పార్చన, పరమయోగిని కాళీమాత పాదపూజ, 2వ తేదీ ఉదయం సర్వదేవత పూజ, కాళీమాతకు అభిషేకం, మహారుద్రచండీయాగం, కుంకుమార్చన, మధ్యాహ్నం పరమయోగిని కాళీమాత జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మహా అన్నదానం చేయనున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు.

## నేడు ప్రత్యేక పూజలు

హుస్నాబాద్‌టౌన్, మే 31: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని గోదాంగడ్డ హనుమాన్ ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఉదయం నుంచే ఆలయంలో అభిషేకాలు సైతం నిర్వహించడం జరుగుతుందని, భక్తులు ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కమిటీ కోరింది. పట్టణంలోని పలు హనుమాన్ ఆలయాల్లో హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

# ముగిసిన వేణుగోపాలస్వామి వార్షికోత్సవాలు



స్వామివారిచక్రస్నానంలో పాల్గొన్న భక్తులు



అంబలి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బాలమల్లు

వర్గల్, మే 31: వర్గల్ రుక్మిణీసత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్షికోత్సవాలు శుక్రవారం ముగిసినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు వేదాంతం మురళీధరాచార్యులు తెలిపారు. ఏకవింశతి కలశన్నపనం, దేవతామూర్తుల చక్రస్నానం, సాయంత్రం ధ్వజారోహణం, దేవతాఉద్వాసనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆనవాయితీగా వస్తున్న అంబలి పంపిణీ కార్యక్రమాన్ని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, వర్గల్ జడ్పీటీసీ బాలమల్లుయాదవ్ కుటుంబీకులు ప్రారంభించారు. ముగింపు పూజలో ఆలయ పునఃనిర్మాణకర్త టేకులపల్లి రాంరెడ్డిదంపతులు, ఆలయ ధర్మకర్త పొద్దుటూరి రాజుగుప్తాతో పాటు గీతాజ్ఞాన మండలి సభ్యులు పాల్గొన్నారు.



ఎంపీడీవో యాదగిరికి వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

## నిధులు మంజూరు చేయించాలి

జగదేవ్‌పూర్, మే 31: గ్రామ పంచాయతీల నిర్వహణకు నిధులు మంజూరు చేయించాలని కోరుతూ శుక్రవారం ఎంపీడీవో యాదగిరికి మండలంలోని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రం అందజేసి సమస్యలను వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి చట్టబద్ధంగా రావాల్సి నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. నిధులు లేక పంచాయతీ కార్మికులను వేతనాలు ఇవ్వడం సమస్యగా మారిందన్నారు. పంచాయతీల్లో కరెంట్ బిల్లులు, ట్రాక్టర్ల నిర్వాహణ, తాగునీటి పంపిణీ, పారిశుధ్యం తదితర అవసరాలకు సొంత డబ్బులు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

### బడిబాటను విజయవంతం చేయాలి

ఆయా గ్రామాల్లో ఈనెల 3 నుంచి నిర్వహించతలపెట్టిన బడిబాటను విజయవంతం చేయాలని ఎంపీడీవో యాదగిరి కోరారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులతో కలిసి గ్రామాల్లో పిల్లలు అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించాలన్నారు. బడీడు పిల్లలు పాఠశాలల్లో చదువుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో హన్‌మత్ యజ్ఞం



హన్‌మత్ యజ్ఞంలో పాల్గొన్న స్వాములు

మద్దూరు(ధూళిమిట్ట), మే 31: ధూళిమిట్ట మండలంలోని బైరాన్‌పల్లి ఆంజనేయ స్వామి ఆలయంలో అర్చకుడు పార్నంది ఆంజనేయశర్మ వైదిక నిర్వహణలో హన్‌మాన్ మాలధారులు శుక్రవారం హన్‌మత్ యజ్ఞాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆంజనేయ స్వామికి పంచామృతాభిషేకం, పుష్పార్చన, మన్యసూక్త హవనం, పూర్ణాహుతి జరిపించారు. గ్రామంలోని నలుదిశల్లో ఉన్న ఆంజనేయస్వామి విగ్రహాలకు చందనాభిషేకాలు నిర్వహించారు. కాలభైరవుడికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో హన్‌మాన్‌స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

# బీడీ కార్మికులకు పెరిగిన వేతనం



మాట్లాడుతున్న ఇదారి మల్లేశం

సిద్దిపేట /సిద్దిపేట టౌన్, మే 31: బీడీ కంపెనీల యాజమాన్యాలతో జరిగిన చర్చలు సఫలమయ్యాయని తెలంగాణ రాష్ట్ర టేకేదారుల సంఘం గౌరవ అధ్యక్షుడు ఇదారి మల్లేశం సంతోషం వ్యక్తం చేశారు.శుక్రవారం నిజామాబాద్ నిఖిల్ సాయి హోటల్‌లో జరిగిన చర్చలకు ఆయా బీడీ సంఘాల యూనియన్ నాయకులతో కలిసి ఆయన సిద్దిపేట నుంచి హాజరయ్యారు. ఈ సందర్భంగా యాజమాన్యాలతో జరిగిన చర్చల్లో 1000 బీడీలకు అదనంగా రూ.4.50 పైసలు పెంచారు. కార్మికులకు పెరిగిన మొత్తం ఏప్రిల్ నుంచి పెంచి ఇవ్వాలని ఒప్పందం కుదిరింది. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మాదాసు రాములు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి, తెలంగాణ రాష్ట్ర బీడీ కార్మిక సంఘం అధ్యక్షుడు మంచే నర్సింహులు, బీడీ కంపెనీ యజమానుల అసోసియేషన్ అధ్యక్షుడు హితేంద్ర ఉపాధ్యాయ, కార్యదర్శి ధర్మేంద్రగాంధీ, రష్మికాంత్ పటేల్ పాల్గొన్నారు.

# మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పిట్టల రవీందర్

హుస్నాబాద్, మే 31: వృత్తిలో మత్స్యకారులు నైపుణ్యాన్ని పెంచుకొని వ్యాపారాన్ని విస్తరించుకొని ఆర్థికంగా అభివృద్ధిని సాధించాలని తెలంగాణ ఫిషరీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిట్టల రవీందర్ అన్నారు. శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలోని ముదిరాజ్ భవన్‌లో పట్టణానికి చెందిన మత్స్యకారులకు ప్రకృతి పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారుల కోసం ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం రూ. 20వేల కోట్లతో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ప్రవేశపెట్టిందని, ఈ పథకం కింద ప్రయోజనం పొంది సొసైటీలను బలోపేతం చేసుకోవాలన్నారు. తెలంగాణలో ఉత్పత్తి అయ్యే చేపలకు ఇతర రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉన్నదని, ఈ అవకాశాన్ని గ్రామీణ సహకార సంఘాలు ఉపయోగించుకొని ఆర్థికంగా ఎదగాలని పిలుపునిచ్చారు. మత్స్య ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముదిరాజ్ సంఘం నాయకులు అయిలయ్య, వనేశ్, రవీందర్, బాలరాజు, సంపత్, బాలయ్య, ఆంజనేయులు, బొడిగె రాజయ్య, గూల్ల రాజయ్య, బాషవేని రాజయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

# ప్రత్యేక పూజలు చేసిన సినీ దర్శకులు



ప్రత్యేక పూజలు చేస్తున్న సినీ దర్శకులు

సిద్దిపేట, మే 31: రావి చెట్టు హనుమాన్ దేవాలయంలో శుక్రవారం బలగం సినిమా డైరెక్టర్ వేణు ఎల్దండి, జార్జిరెడ్డి సినిమా డైరెక్టర్ జీవన్‌రెడ్డితో పాటు సేవ్ ద టైగర్స్ టు యాక్టర్ కొత్తపల్లి అరుణ్ ప్రత్యేక పూజలు చేశారు. గోశాలలో గోసేవ చేశారు. ఆలయానికి వచ్చిన డైరెక్టర్లు, నటుడికి హనుమాన్ దీక్షస్వాములు స్వాగతం పలికారు. ఆలయంలో గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు చేసి స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. సిద్దిపేటకు చెందిన హనుమాన్ మాలధారుడు కిశోర్‌బాబు ఆహ్వానం మేరకు వీరు దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు కృష్ణమాచార్యులు, కిశోర్ బాబు, సిద్దిపేట హనుమాన్ మాలధారులు పాల్గొన్నారు.

## మొక్కలను సంరక్షించాలి

సిద్దిపేట, మే 31: హరితహారంలో నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి అన్నారు. హరిత శుక్రవారంలో భాగంగా రంగనాయక సాగర్ వద్ద ఉన్న సిద్దిపేట మున్సిపల్ నర్సరీలో మొక్కలకు ఆమె నీటిని పట్టారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాటిన మొక్కలను రక్షించుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. గ్రీన్ సిద్దిపేట క్లీన్ సిద్దిపేట లక్ష్యంగా అందరం మొక్కలను సంరక్షించుకుందామన్నారు. హరితహారం అధికారి ఐలయ్య, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## మహిళలకు ఉచితంగా విద్యను అందిస్తున్నాం

కొండపాక(కుకునూరుపల్లి), మే 31 : సద్గురు శ్రీమధుసూదనాసాయి ఆశీస్సులతో 28 సంస్థల్లో 5వేల మంది మహిళలకు ఉచిత విద్య అందిస్తున్నామని సంస్థ చైర్‌పర్సన్ పూర్ణిమా శంకర్ అన్నారు. శుక్రవారం కొండపాకలోని సత్యసాయి మహిళా కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సద్గురు శ్రీ మధుసూదనాసాయి ఆశీస్సులతో మొట్టమొదటి మహిళా కళాశాలను కొండపాకలోనే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సంస్థలో ఆరో తరగతిలో ప్రవేశం పొందితే పీజీ నుంచి పీహెచ్‌డీ వరకు విద్యార్థినుల ప్రతి అవసరాన్ని సంస్థ చూసుకుంటుందన్నారు. కళాశాల కార్యదర్శి ఎం.శంకర్, డిప్యూటీ చైర్‌పర్సన్ రాధిక, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## నిరుపేదకు అండ బీఆర్ఎస్

మిరుదొడ్డి, మే 31 : మిరుదొడ్డి టౌన్‌లో ఇటీవల పారిశుధ్య కార్మికుడు పరశురాములు తల్లి భూంపల్లి రాజవ్వ మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్ రెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి క్వింటాల్ బియ్యంతో పాటు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గొట్టం బైరయ్య, బీఆర్ఎస్ నాయకులు గొల్ల రాములు, మల్లయ్య, రమేశ్, ఐలయ్య పాల్గొన్నారు.

### బడిబాట విజయవంతం చేయాలి

మిరుదొడ్డి, మే 31 : ఈ నెల 3వ తేదీ నుంచి 19వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే బడి బాట కార్యక్రమాన్ని ఆయా శాఖల అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం అధికారులతో కలిసి ఎంఈవో జోగు ప్రభుదాస్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో గణేశ్‌రెడ్డి, ఎస్సై పరశురాములు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనుల పరిశీలన

కొండపాక(కుకునూరుపల్లి), మే 31 : కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను శుక్రవారం చీఫ్ ఇంజినీరు అనిల్‌కుమార్, డిప్యూటీ ఇంజినీరు మక్బూల్, ఏఈ రాజుగౌడ్, సత్తయ్యతో కలిసి పరిశీలించాడు. ఈ సందర్భంగా పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

## విద్యుత్ అంతరాయానికి సహకరించాలి

సిద్దిపేట, మే 31: విద్యుత్ అంతరాయానికి సహకరించాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ మోహన్‌రెడ్డి కోరారు. శుక్రవారం ఎస్ఈ కార్యాలయ సమావేశ మందిరంలో విద్యుత్‌శాఖ జిల్లా అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొన్ని ప్రాంతాల్లో స్తంభాలపై ఉన్న వైర్లు సాగి ఉన్నాయని, స్తంభాల మధ్య దూరం ఎక్కువగా ఉన్నదని అలాంటి వాటిని సరి చేయడానికి, మరమ్మతుల కోసం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. జిల్లావ్యాప్తంగా మరో 8 ఉప కేంద్రాల మంజూరు కోసం అంచనాలు పంపించడం జరిగిందన్నారు. ఎక్కువ విద్యుత్ కనెక్షన్లు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల లోడును తగ్గించడానికి అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు.

## పశువుల సంత కొనసాగించాలి

చేర్యాల, మే 31 : పట్టణంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న పశువుల సంతను కొనసాగించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు అందె అశోక్ కోరారు. శుక్రవారం పట్టణంలోని కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రతి మంగళవారం పశువుల సంత కొనసాగడంతో ఆయా గ్రామాల నుంచి వచ్చిన రైతులు వారికి అవసరమైన దున్నలు, కాడెద్దులు తదితర వాటిని కొనసాగే వారన్నారు.గతంలో పశువుల సంత ప్రదేశం కబ్జాకు గురికావడంతో అక్కడ నిలిచిపోయిందన్నారు. కొన్ని మాసాల క్రితం అఖిలపక్షం ఆధ్వర్యంలో ఉద్యమాలు చేసి సదరు ప్రదేశాన్ని మున్సిపాలిటీకి అప్పగించినప్పటికీ పశువుల సంత కొనసాగడం లేదన్నారు. పశువుల కొనుగోలు కోసం రైతులు ఇతర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. సంతని వెంటనే ప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.సమావేశంలో నాయకులు ఈరి భూమయ్య, బండారి సిద్ధులు, గూడెపు సుదర్శన పాల్గొన్నారు.

## ఉత్తమ ఆర్టీసీ ఉద్యోగులకు సన్మానం

గజ్వేల్, మే 31: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపోలో ఉత్తమ ఉద్యోగులకు శుక్రవారం డిప్యూటీ ఆర్ఎం దైవాదీనం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల్లో అప్రమత్తంగా ఉండడంతో పాటు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడంలో ఆర్టీసీ డ్రైవర్లు తీసుకునే చొరవ చాలా గొప్పదన్నారు. డ్రైవర్ల విభాగంలో బాల్‌రెడ్డి, సలీం, ఆంజనేయులు, బాలయ్య, కండక్టర్ల విభాగంలో రాణి, వాల్య, రజిత, శ్రీనివాస్, నాగేందర్, మెకానిక్ విభాగంలో అమీనొద్దీన్, వెంకటేశం, రహీం, రియాజొద్దీన్, శివకుమార్, జగన్‌ను సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీఎం సురేఖ, బాబు నాయక్, జమీల్, జయకుమార్, కేఎంరెడ్డి, నర్సింహులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు వేగంగా పూర్తిచేయాలి

రాయపోల్, మే 31: పాఠశాలల అభివృద్ధి పనులను వేగంగా పూర్తిచేయాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి కాంట్రాక్టర్లకు సూచించారు. శుక్రవారం దౌల్తాబాద్, రాయపోల్ మండలాల్లో అయన ఆకస్మికంగా పర్యటించారు. మౌలిక వసతులపై ఆయా గ్రామాల్లో ఉన్న పాఠశాలల్లో అరా తీశారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అన్ని పనులు పూర్తి చేయించాలని సంబంధిత అధికారులను అదేశించారు. అనంతరం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బడిబాటకు సంబంధించిన రోజువారి కార్యక్రమాలను ఏ విధంగా నిర్వహించాలో సూచించారు. జూన్ 3 నుంచి 19 వరకు బడిబాట విజయవంతం చేసేందుకు అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి నర్సమ్మ, అయా గ్రామాల పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్లు, సీఆర్పీలు పాల్గొన్నారు.

**PUBLIC NOTICE**

The public in general are here by informed that Smt. Dasari Rajeshwari Wife of Kanakaiah, Resident of Siddipet, has approached my client bank/finance and release of loan and offered her property of Open Plot No. 649 situated in Sy No. 108 to an extent of 150 Sq.Yds situated at Old G.P. Gadicherlapally, Now Merged in Siddipet Municipality, Dist: Siddipet and the same was bounded by **East** : Road 21 Feets, **West :** Plot No. 638, **North:** Plot No. 650, **South:** Plot No. 648 acquired through Registered sale Deed D.No. 3752/ 2021 SRO Siddipet and further informed that its Original link Registered Sale Deed Vide D.No. 5642/ 2001 SRO Siddipet pertaining to above property was lost. Hence the general Public are informed to submit objections/ claims if any within (7) days of this publication to me, for sanction and release of loan in respect of the above property in favour of Smt. Dasari Rajeshwari and mortgaging the same in favour of my client bank/ Finance. If no objections are received within the above stipulated time, it shall be deemed that there are no objections and my client will proceed further, Later no objections will be entertained.

Sd/- **Pinna Ramulu**
Advocate & Notary
H.No. 9-4-3, Near Court,
Siddipet-502103 (T.S),
Cell No. +91 9849321422